క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



ఇటిక్యాల: మండల పరిధిలోని చాగాపురానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గోరంట్ల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మంగళవారం ఫోన్ ద్వారా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు దహన సంస్కారాల నిమిత్తం రూ.5000 నగదు అందజేశారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించాలి



అలంపూర్: ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఉండవెల్లి మండల కేంద్రంలో తహసీల్దార్‌కు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జయరాజు, డీపీఎంసీ సభ్యుడు మణిరాజులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామ శివారు పలు సర్వే నంబర్లలోని సీలింగ్, భూదాన్ భూములు కొందరు ప్లాట్లు వేసి కబ్జా చేసి, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు వినతిలో పేర్కొన్నారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమిని సంరక్షించాలని కోరారు.

మహిళా సమాఖ్యలో ఆడిటింగ్

మానవపాడు: మండలంలోని మహిళా సమాఖ్య భవనంలో ఆడిటర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆడిటింగ్ నిర్వహించారు. మహిళా సంఘాల రశీదులు,సంఘాలకు సంబంధించి రికార్డులు తనిఖీ చేశారు.కార్యక్రమంలో ఏఈ ఎం భీమన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



గట్టు: మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని ఇన్‌చార్జ్ ఏపీఎం జయకర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆరగిద్దలో స్నేహ బాలికల సంఘాల ఆధ్వర్యంలో కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగ సమానత్వం ప్రాథమిక హక్కన్నారు. మానవ సామర్థ్యం, స్థిరమైన అభివృద్ధి ద్వారా శాంతియుత సమాజాన్ని నిర్మించవచ్చునని తెలిపారు. జూన్ 10 వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం నాడు కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీఓఏ మునేశ్వరి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

చోరీకి గురైన గన్నీ బ్యాగుల గుర్తింపు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి కేటాయించిన మూడు గట్టాల గన్నీ బ్యాగులు వారం రోజుల క్రితం అపహరణ గురయ్యాయి. కాగా మంగళవారం కొనుగోలు కేంద్రం సమీపంలోని నీటి గుంటలో అవి దొరికినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ విషయమై ఏపీఎం బిచ్చన్నను వివరణ కోరగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన గన్నీ బ్యాగులను రైతులకు అందజేశామని, అవి అపహరణకు గురయిన విషయంలో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ



అయిజ: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు రాముడు, భీమేష్, సుధాకర్, పాండు, శివ తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాలే దిక్కు..

- ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు కరువు
- కార్యకలాపాల నిర్వహణలో అవస్థలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల భవనం

రాజోళి: మండల కేంద్రమైతే ఏర్పాటు చేశారు కానీ, మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించ లేదు. మండల కేంద్రంగా ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం మాత్రం జరగడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండల ప్రకటనతోనే సరి..

రాష్ట్రంలో నూతన జిల్లాల ఏర్పాటు అనంతరం మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న రాజోళిని 2016లో మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. కానీ నేటి వరకు ప్రభుత్వ కార్యాలయాలకు ప్రత్యేకంగా భవనాలు నిర్మించలేదు. గతంలో చిన్నపాటి భవనాల్లో ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం నిర్వహణకు ఏ మాత్రం ఉపయోగ పడటం లేదు. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే కార్యాలయాల్లో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

అద్దె భవనాల్లో..

మండల కేంద్రం అనగానే ముందుగా గుర్తుకు వచ్చే తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, కానీ రాజోళిలో ఈ రెండు కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. తహసీల్దార్ కార్యాలయం ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో నడుస్తుండగా, ఎంపీడీఓ కార్యాలయాన్ని అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. మహిళా సంఘం కార్యాలయాన్ని కూడా గతంలో నిర్మించిన డ్వాక్రా భవనంలోనే నడుపుతున్నారు. ఇక వెటర్నరీ భవనం రేపో మాపో కూలేందుకు సిద్ధంగా ఉండి విష సర్పాలకు నిలయంగా మారినా అందులోనే సిబ్బంది కాలం వెల్లదీస్తున్నారు. మండల కేంద్రం ఏర్పాటయ్యాక కొత్తగా ఎంఆర్‌సీ భవనం నిర్మించి అందులోనే ఉపాధి హామీ శాఖకు సంబంధించిన పనులు నిర్వహిస్తున్నారు. కళాశాల కోసం విద్యార్థులు ఏళ్ల తరబడి చిన్నపాటి ఉద్యమం చేస్తున్నా నేటి వరకు ఎలాంటి చలనం లేదు.

వడ్డేపల్లిలోనే కొనసాగింపు..

ప్రాథమిక సహకార సంఘం ఉమ్మడి వడ్డేపల్లి మండల ప్రాతిపదికలోనే ఉండగా, వడ్డేపల్లిలో ఉన్న కార్యాలయానికే రైతులు వెళ్లక తప్పడం లేదు. ఎంఈఓ కార్యాలయం కూడా ఉమ్మడిగానే కొనసాగడం, ఒకే అధికారి ఉండటంతో రాజోళిలో ఆ భవనాలకు నిర్మాణం జరుగలేదు.

పాఠశాల భవనంలో..

వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని పాఠశాల భవనంలో ఏర్పాటు చేయగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రికార్డులు ఉంచేందుకు కూడా భవనం సరిపోకపోవడంతో అధికారులు, రైతులు కూడా ఇబ్బంది పడుతున్నారు.

ప్రజలకు తప్పని ఇబ్బందులు

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడం, శిథిలావస్థలో ఉన్న అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న కార్యాలయాల్లో కూడా వసతులు లేక ఇక్కట్లు తప్పడం లేదు. ఇళ్ల మధ్యనే కార్యాలయాలు ఉండటంతో వాహనాలు నిలిపేందుకు కూడా సరైన స్థలం లేకపోవడం, రైతులకు సంబంధించిన సామగ్రి తీసుకెళ్లడంలో వచ్చే ఇబ్బందులతో అటు అధికారులు, ఇటు ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలుమార్లు ఫిర్యాదులు, వినతులు అందజేసిన ఉపయోగం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. వీలైనంత త్వరగా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించి, మండలాన్ని అభివృద్ధి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పాఠశాల భవనంలో నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ కార్యాలయం

శిథిల భవనాల్లోనే

మండల కేంద్రం ఏర్పాటయ్యాక ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. తహసీల్దార్ కార్యాలయంలో కడ్డీలు బయటకు తేలగా, పశుసంవర్ధక శాఖ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నూతన భవన సముదాయాలు ఏర్పాటు చేయాలి.

– హనుమంతు, రాజోళి

ఉన్నతాధికారులకు తెలియజేశాం

మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనంలో, కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరిన విషయం ఉన్నాతాధికారులకు తెలియజేశాం. రెవెన్యూ అధికారులు కూడా సొంత భవనం గురుంచి తెలియ చేశారు. ఉన్నతాధికారులతో ఈ విషయంపై చర్చిస్తాం.

– ఖాజా మొహినుద్దీన్, ఎంపీడీఓ రాజోళి

నైపుణ్యంతో బోధన చేయాలి



అలంపూర్‌లో శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న సెంటర్ ఇన్‌చార్జ్ రాములు

అలంపూర్: విద్యార్థులకు నైపుణ్యంతో బోధన చేయాలని ఎంఈఓ అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో అలంపూర్ మండలంలోని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు మంగళవారం 5 రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమం ప్రారంభించారు. తెలుగు సబ్జెక్టుపై ఎమ్మార్పీలు రాజ్‌కుమార్, ఎల్లక్రిష్ణ శిక్షణ ఇచ్చారు. లేఖనం, పఠనం, ఎఫ్ఎల్ఎన్ పునఃశ్చరణ, మౌకిక సామర్థ్యాలు, ధ్వని గుర్తింపు, అక్షర గుర్తింపు, పాఠ్య పుస్తక అమరిక, నిర్మాణాల గురించి అవగాహన కలిగించారు. ఉపాధ్యాయులతో చర్చించి సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలంపూర్ చౌరస్తాలో..

అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాలలో ఉండవెల్లి, మానవపాడు మండలాల్లోని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ శివకుమార్, కోర్సు డైరెక్టర్లు రామక్రిష్ణ, హేమలత, అనితబాయిల ఆధ్వర్యంలో 20 మంది ఆర్పీలు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణలో మొత్తం 232 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

ప్రారంభమైన శిక్షణ తరగతులు

అయిజ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సెంటర్ ఇన్‌చార్జ్ ఎంఈఓ రాములు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఉదయం 9.30 నుంచి 5 గంటల వరకు మొదటి రోజు శిక్షణ ఇచ్చారు. ఎఫ్ఎల్ఎన్ విద్యా విధానంలో రాష్ట్రంలో జరగాల్సినంత అభివృద్ధి జరుగకపోవడంతో మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇన్ సరీస్ అనే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీలు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం



ఆలూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి

గట్టు: ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి అన్నారు. మంగళవారం ఆలూరు క్లస్టర్ పరిధిలోని ఆలూరు, వాయిల్‌కుంటతండా, తుమ్మలచెరువు గ్రామాల రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం సురక్షితమైందని, పోషకాలు కలిగిన ఆహారం లభిస్తుందన్నారు. పర్యావరణానికి ఎంతో మేలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో క్రిమి సంహారక మందులు, భూసారం దెబ్బతినకుండా పంటలను పండించవచ్చని సూచించారు. గట్టు మండలంలో ఒక క్లస్టర్ ద్వారా 125 మంది రైతులు 50 హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయాన్ని రెండేళ్ల పాటు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి భార్గవి, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గ్రామస్తులు

అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విజయుడు మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. అయిజ మండలం ఉప్పల గ్రామానికి చెందిన దొడ్ల హేజికెల్ వైద్య సహాయం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 1.75 లక్షల చెక్కు మంజూరైనట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం..

రాజోళి మండలం పెద్దతాండ్రపాడు గ్రామస్తులు గణపతి, జమ్ములమ్మ, పరుశురాముడు, లింగమయ్య, వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠపాన మహోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం పత్రం అందజేశారు. ఈ నెల 23న హాజరుకావాల్సిందిగా కోరారు.

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

అలంపూర్: రోడ్డు ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఉండవెల్లి ఎస్ఐ మహేష్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. చనుగోండ్ల గ్రామానికి కెకెందిన కుమ్మరి మునిస్వామి అతని స్నేహితులు సూర్య శేఖర్, మహేష్, రాఘవేందర్ ఈ నెల 19న అర్ధరాత్రి 12.05 గంటల సమయంలో పుల్లూరు టోల్‌ప్లాజా వద్దకు టీ తాగడానికి వచ్చారు. టీ తాగిన అనంతరం తిరిగి వెళ్తుండగా డూన్ దాబా వద్ద కర్నూలు వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో మునిస్వామి, సూర్యశేఖర్ గాయపడ్డారు. బాధితుడు మునిస్వామి ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ చాపల శివకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై కార్లు ఢీ



మానవపాడు: జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారు సడెన్ బ్రేక్ వేసిన ఘటనలో మూడు కార్లు ఢీకొన్న ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మానవపాడు మండలంలోని బోరవెల్లి స్టేజి సమీపంలోని జాతీయ రహదారి– 44పై హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కారు సడెన్ బ్రేక్ వేయడంతో కారును వెనుక వస్తున్నా మరో రెండు కార్లు ఢీకొట్టాయి. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. కార్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని చేసి ట్రాఫిక్ జాం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

మానవపాడు: మద్యం తాగి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రజలు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనం ఇచ్చిన తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

గట్టు: మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో బుధవారం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి శంకరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11 వరకు టీకాలను వేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



నిరసన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అలంపూర్: కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజా సమస్యలు తక్షణం పరిష్కరించాలని, లేని యెడల పోరాటం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ వర్కర్స్ యునియన్ జిల్లా కార్యదర్శి ఏమెలమ్మ అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్, సీఐటీయూ ప్రజా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. సుధీర్ఘ పోరాటలతో సాధించుకున్న కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకులంగా మారుస్తుందని ఆరోపించారు. కార్మికుల కనీస వేతం రూ. 26 వేలు, బీమా సౌకర్యం, ఉపాధి కూలీల సంఖ్యను బట్టి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో 22 కోట్ల పనిదినాలు కల్పించాల్సి ఉండగా.. 6 కోట్ల పనిదినాలకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఉపాధి హామీలో 200 పని దినాలు, రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలన్నారు. కూలీలకు వేసవి అలవెన్సులు, పనిముట్లు, మెడికల్ కిట్లు అందించాలన్నారు. అదే విధంగా ఈ నెల 30న సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు, ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ్మ, నాగరాజు, అయ్యప్ప, శ్రీను, రాముడు, ఖలీల్, లోకరాజు, రాము, అంగన్‌వాడీ టీచర్లు భారతి, రూపప్రియ, మాధవి, మనెమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

జవాన్లకు మద్దతుగా తిరంగా ర్యాలీ



ర్యాలీలో వివిధ సంఘాల నాయకులు

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో ఆపరేషన్ సిందూర్ చేపట్టిన జవాన్లకు మద్దతుగా అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు నినాదాలు చేశారు. జాతీయ జెండాలు పట్టుకుని జవాన్లకు సంఘీభావం తెలిపారు. స్థానిక ఐలమ్మ విగ్రహం వద్ద నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బండల వెంకట్రాములు, అఖిలపక్ష నాయకులు లాయర్ శ్రీను, సూరి, మధుసూదన్‌గౌడ్, సంజీవరెడ్డి, నరసింహ విశ్వహిందూ పరిషత్ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలి



గోపల్‌దిన్నేలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఇటిక్యాల: ఇందిరమ్మ ఇంటి నిర్మాణ విషయంలో నాణ్యత పాటించాలని హౌసింగ్ పీడీ కాశీనాథ్, డీఈ నరేందర్ అన్నారు. మండల పరిధిలోని గోపల్‌దిన్నే గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్చి నాటికి బేస్‌మెంట్ పూర్తి చేసిన లబ్ధిదారులకు మొదటి విడత ద్వారా ఇప్పటికే రూ.లక్ష మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని విడతల వారీగా లబ్ధిదారులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. పనులను నాణ్యతతో చేపట్టేలా అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్ గ్రామంలో మంగళవారం ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. నిర్మాణ విషయంలో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రాజోళి: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గతంలో గ్రామ పంచాయతీ తీర్మానం చేసి నెలకు రూ.11,700 వేతనం చెల్లించాలని నిర్ణయిస్తే, నేటికి రూ.9,500 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసం శ్రమిస్తున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు తగిన వేతనం చెల్లించడంతో పాటు పలు డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మన్న, రాజు, కృష్ణ, తిక్కన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తికి గాయాలు



గాయపడిన కృష్ణయ్య

మల్దకల్: మోటారుసైకిల్‌పై వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. అమరవాయి గ్రామానికి చెందిన కృష్ణయ్య ద్విచక్ర వాహనంపై బింగిదొడ్డి నుంచి అమరవాయికు వస్తుండగా అయిజ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం మల్దకల్ గ్రామ సమీపంలో ఢీకొట్టింది. ప్రమాదంలో కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కృష్ణయ్యను చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రి రెఫర్ చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రేపు హనుమాన్ చాలీసా పారాయణం

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్య క్షేత్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతిని పురస్కరించుకొని వికాస తరంగిణి, విశ్వ హిందూ పరిషత్, ధర్మప్రసార సమితి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు చిన్నజీయర్ స్వామి శిష్య బృందం సభ్యుడు సత్యం రామానుజదాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో పంచామృత అభిషేకం, ఆకుపూజ, వడమాల, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, ప్రత్యేక పూజలు, హనుమాన్ జయమంత్రం 1008 పర్యాయాలు పారాయణం చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఆంజనేయస్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

‘గిరిజనులకు భూ పట్టాలివ్వాలి’



మాట్లాడుతున్న ఆర్. వెంకట్రాములు

ఖిల్లాఘనపురం: గిరిజనులు తరతరాల నుంచి సాగు చేస్తున్న భూములపై ప్రభుత్వం స్పందించి అర్హులకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో భూ పట్టాల సాధన కమిటీ కన్వీనర్ సక్రునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మామిడిమాడ, షాపురం గ్రామాల రెవెన్యూ శివారుల్లోని రాజుల కాలం నాటి పొలాలను గిరిజనులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఆరు తరాలుగా 8 తండాలకు చెందిన గిరిజనులు సుమారు 480 ఎకరాల భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అయినా వారికి మాత్రం పట్టాలు రావడం లేదని వాపోయారు. అనేక దఫాలుగా భూ పంపిణీ, సీలింగ్ చట్టాలు వచ్చినా గిరిజనులకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సక్రునాయక్, బాల్యానాయక్, ఎం.అంజనేయులు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.